బుధవారం

01-5-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 321, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## కేజ్రీవాల్ అరెస్టు ఎన్నికల ముందే ఎందుకు..?

● కేజ్రీవాల్ ప్రమేయం ఏవిధంగా ఉందో చెప్పండి ● ఈడీని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

**ముందడుగు ఢిల్లీ:**

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను లోక్‌సభ ఎన్నికల ముందు అరెస్టు చేయడంపై ఈడీని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. జీవితం, స్వేచ్ఛ చాలా ముఖ్యమైనవి. మీరు వాటిని కాదనలేరు'' అని పేర్కొంటూ.. అరెస్టు చేసిన సందర్భంపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ కేసులో న్యాయపరమైన విచారణలు లేకుండా క్రిమినల్ చర్యలను కేంద్ర ఏజెన్సీ చేపట్టవచ్చో? లేదో? చెప్పాలని తెలిపింది. ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎలాంటి జప్తు చర్యలు తీసుకోలేదని, ఒకవేళ తీసుకుంటే.. ఈ వ్యవహారంలో కేజ్రీవాల్ ప్రమేయం ఏవిధంగా ఉందో చూపించాలని ఈడీ తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ రాజుకు జస్టిస్ ఖన్నా తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు అరెస్టు ఎందుకు? అని ప్రశ్నించారు. ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టైన కేజ్రీవాల్ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీ కింద తిహాడ్ జైల్లో ఉన్నారు. అంతకుముందు ఆయన్ను ఈడీ అరెస్టు చేయడాన్ని హైకోర్టు సమర్థించిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. శుక్రవారం ఈ పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది.







## చార్‌ధామ్ యాత్ర భక్తులకు పరిమితి


వివరాలు 2లో

## లోక్‌సభ ఎన్నికల్లో ప్రియాంక పోటీకి దూరం..?

వివరాలు 2లో

## కరీంనగర్ ఐసీయూలో పనిచేయని ఏసీలు

వివరాలు 2లో



## గంట వ్యవధిలోనే ఏడు ఇంజక్షన్లు ఇచ్చిన ఆర్ఎంపీ


వివరాలు 3లో

## స్మృతి ఇరానీ ఆస్తులు రూ.6 కోట్లు పెరిగాయి

అఫిడవిట్ దాఖలుతో పలు కీలక విషయాలు

**ముందడుగు జాతీయం:**

కేంద్రమంత్రి స్మృతి ఇరానీ అమేథీ లోక్‌సభ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. అఫిడవిట్ దాఖలుతో కీలక విషయాలు బయటకు వచ్చాయి. గత ఐదేళ్లలో స్మృతి ఇరానీ ఆస్తులు పెరగడం విశేషం. స్మృతి ఇరానీ స్థిరాస్తుల విలువ రూ.17 కోట్లు ఉన్నట్లుగా పేర్కొన్నారు. మొత్తానికి గత ఐదేళ్లలో కేంద్రమంత్రి ఆస్తులు రూ.6 కోట్లు పెరిగాయి. ఎలాంటి క్రిమినల్ కేసులు లేనట్లుగా **మిగతా 2లో**



## బిజెపి పార్టీ రిజర్వేషన్లు ఎప్పుడు తొలగించదు

● అసహనంతోనే కాంగ్రెస్ పార్టీ ఫేక్ వీడియోలు

● తీవ్రంగా స్పందించిన బిజెపి అగ్రనేత అమిత్ షా

**ముందడుగు జాతీయం:**

ఎన్నికల వేళ కేంద్ర హోం మంత్రి అమిత్ షా రిజర్వేషన్లను తొలగిస్తామని చెప్పినట్లు కొన్ని వీడియోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఈ అంశంపై తాజాగా అమిత్ షా తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ, **మిగతా 2లో**





## మీ మేనిఫెస్టోలు బాండ్ పేపర్ మీద రాసివ్వండి

వివరాలు 4లో

ముందడుగు
బుధవారం, 01-5-2024, హైదరాబాద్

## స్మృతి ఇరానీ ఆస్తులు
# రూ.6 కోట్లు పెరిగాయి

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల అఫిడవిట్‌లో స్మృతి ఇరానీ వెల్లడించారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో స్మృతి ఇరానీ కుటుంబం మొత్తం ఆస్తుల విలువ దాదాపు రూ. 11 కోట్లు కాగా.. ఇప్పుడు రూ. 17 కోట్లుగా పేర్కొన్నా రు. అంటే గత ఐదేళ్లలో స్మృతి ఇరానీ కుటుంబ సంపద సుమారు రూ. 6 కోట్లు పెరిగింది. స్మృతి ఇరానీకి చెందిన చరాస్తులు రూ. 25,48,000 ఐదు పోదుపు ఖాతాలలో డిపాజిట్ చేయబడింది. రూ. 88 లక్షలు మ్యూచువల్ ఫండ్స్‌లో ఉన్నాయి. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్/పోస్టాఫీసు బ్యాలెన్స్ విలువ రూ. 30,77,936గా ఉంది. 2023లో కారును కొనుగోలు చేసినట్లుగా తెలిపారు. ఇక ఆభరణాల విలువ రూ. 37,48,440గా చూపించారు. స్థిరాస్తుల్లో ఆరు వ్యవసాయ భూములు, ఒక వ్యవసాయేతర భూమి ఉంది. అలాగే నాలుగు ఇళ్లు ఉన్నట్లుగా తెలిపారు. ముంబయిలో రెండు, గోవాలో ఒకటి, పూణేలో మరొకటి ఉన్నట్లుగా వివరించారు.

## బిజెపి పార్టీ రిజర్వేషన్లు
# ఎప్పుడు తొలగించదు

మొదటిపేజీ తరువాయి

రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అసహనంతోనే ఆ పార్టీ ఫేక్ వీడియోలు తయారు చేస్తోందని మండిపడ్డారు. ఈ ఫేక్ వీడియోను షేర్ చేయడం వెనుక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రమేయం ఉందని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో రాహుల్ రాజకీయాలను దిగజారుస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీకి 400 సీట్లు వస్తే రిజర్వేషన్‌ను తొలగిస్తుందని రాహుల్ అసత్య ప్రచారం చేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లను మా పార్టీ ఎప్పటికీ తొలగించదు. అలాగే ఎవరినీ అనుమతించదు. ఇది మోదీ గ్యారెంటీ. మోదీ రిజర్వేషన్‌కి మద్దతుదారు. తమకు రెండు దఫాలుగా పూర్తిగా మెజారిటీ దక్కింది. ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లను బీజేపీ తొలగించదు' అని అమిత్ షా స్పష్టం చేశారు.

## జైల్లో కేజ్రీవాల్‌ను కలిసిన
# పంజాబ్ సీఎం
### ఇన్సులిన్ తీసుకుంటున్నారని వెల్లడి

ముందడుగు ఢిల్లీ:

ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టై తిహార్ జైలులో ఉన్న ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను పంజాబ్ సీఎం భగవంత్ మాన్ కలిశారు. కేజ్రీవాల్ ఆరోగ్యంగానే ఉన్నారని.. ఇన్సులిన్ తీసుకుంటున్నారని వెల్లడించారు. మంగళవారం అతడిని కలిసిన అనంతరం భగవంత్ మాన్ మీడియాతో మాట్లాడారు.. ''లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి అభ్యర్థుల గెలుపు కోసం చురుగ్గా క్యాంపెయిన్ చేయాలి. ప్రజలు తన గురించి ఆందోళన చెందొద్దని, ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కేజ్రీవాల్



విజ్ఞప్తి చేశారు'' అని మాన్ తెలిపారు. కేజ్రీవాల్ అరెస్టయి జైలుకు వెళ్లాక సీఎం భగవంత్ మాన్ ఆయనను కలవడం ఇది రెండోసారి. ఢిల్లీ మద్యం విధానం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేయగా.. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా ఏప్రిల్ 1 నుంచి ఆయన తిహాడ్ జైలులో ఉంటున్నారు.

# చార్‌ధామ్ యాత్ర భక్తులకు పరిమితి

**రోజుకు 16 వేల మందికే దర్శనం ● ఇప్పటికే 19 లక్షల మంది భక్తులు రిజిస్ట్రేషన్**

ముందడుగు జాతీయం:

హిందువులు పరమ పవిత్ర యాత్రగా భావించే ఉత్తరాఖండ్‌లో చార్ ధామ్ యాత్ర మే 10 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు 19 లక్షల మందికి పైగా భక్తులు యాత్రకు రిజిస్టర్ చేసుకున్నారు. గత సంవత్సరం సుమారు 55 లక్షల మంది భక్తులు దర్శనానికి వచ్చారు. దీని కారణంగా అనేక ఏర్పాట్లలో సమస్యలు ఉన్నాయి. ఈ సంవత్సరం దీని నుండి గుణపాఠం తీసుకొని ఉత్తరాఖండ్ పోలీసులు, పర్యాటక శాఖ చార్‌ధామ్ యాత్రలో భక్తుల కోసం రోజు వారీ పరిమితిని ఉంచింది. పర్యాటక శాఖ ప్రకారం, చార్‌ధామ్



యాత్రలో, కేదార్‌నాథ్ ధామ్‌లోని బాబా మహాకాల్‌ను ఒక రోజులో 15 వేల మంది భక్తులు దర్శనం చేసుకోగలరు. బద్రీనాథ్ ధామ్‌ను రోజుకు 16 వేల మంది, యమునోత్రిలో 9 వేల మంది భక్తులు, గంగోత్రిలో 11 వేల మంది భక్తులు దర్శించుకోనున్నారు. అంతే కాకుండా ఈ సంఖ్య పెరిగితే భక్తులను నిలువరించేందుకు త్రిషికేశ్‌లో అడ్డంకి పట్టణాలను కూడా సిద్ధం చేశారు. ఎవరైనా బద్రీనాథ్ వెళ్లాలనుకుంటే ముందుగా శ్రీనగర్‌లో నిలుపుతారని పర్యాటక శాఖ తెలిపింది. ఇక్కడి పరిమితి దాటితే భక్తులు రాత్రి ఇక్కడే గడపాల్సి వస్తుంది. దీని తర్వాత రుద్రప్రయాగ్, చమోలి, పిప్పల్‌కోటి, జోషిమఠ్‌లలో మరుసటి రోజు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. అంటే నంబర్ వస్తేనే మనం ముందుకు వెళ్లగలం. దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్యపై టూరిజం శాఖ రోజువారీ పరిమితిని విధించడంపై హోటల్, హోమ్ స్టే వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## కరీంనగర్ ఐసీయూలో
# పనిచేయని ఏసీలు
### వేడి గాలితో రోగుల తీవ్ర ఇక్కట్లు

ముందడుగు కరీంనగర్:

కరీంనగర్ జిల్లాలోనే పెద్ద ఆసుపత్రిగా పేరుగాంచిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని అత్యంత కీలక విభాగమైన ఐసీయూలో ఏసీలు పని చేయడంలేదు. గత కొన్ని రోజులుగా పని చేయకున్నా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు.

రెండు ఐసీయూ వార్డుల్లో కలిపి మొత్తం ఆరు ఏసీలున్నాయి. అందులో ఒక్కటే పనిచేస్తుండటంతో చల్లదనం సరిపోవడం లేదు. గత్యంతరం లేక కిటికీలు తీసి ఫ్యాన్లు వేయడంతో వేడి గాలి భరించలేక రోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఆరు నెలల కిందట జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని కరీంనగర్ వైద్య కళాశాలకు అనుసంధానం చేశారు. అయినా మార్పు రాలేదు. మూడేళ్ల నుంచి పదేపదే దెబ్బతినడంతో మరమ్మతు చేస్తూ వస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని రోగులు మొత్తుకుంటున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఏసీల మరమ్మతు విషయం తమ దృష్టికి వచ్చిందని, జిల్లా కలెక్టర్‌కు సమాచారాన్ని నివేదించామని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## లోక్‌సభ ఎన్నికల్లో
# ప్రియాంక పోటీకి దూరం..?

- రాయ్‌బరేలీ నుంచి ఎవరు పోటీ అనేది సందిగ్ధత
- ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా ఆసక్తి



ముందడుగు జాతీయం:

అమేథీ నుంచి రాహుల్ గాంధీ, రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక గాంధీ వాద్రానే పోటీ చేస్తారని గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే, ఇందుకు ప్రియాంక విముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఆమె పోటీ చేసే అవకాశాల్లేనట్లు సమాచారం. ఈ మేరకు పార్టీ విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా సంస్థలు కథనాలు వెల్లడించాయి. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకూడదని ప్రియాంక గాంధీ నిర్ణయించుకున్నట్లు సదరు వర్గాలు తెలిపాయి. కేవలం ఒక సీటు నుంచి పోటీ చేయకుండా.. తాను దేశమంతా ప్రచారం చేస్తేనే పార్టీకి మంచి ఫలితాలొస్తాయని ఆమె భావిస్తున్నట్లు పేర్కొన్నాయి. అంతేగాక, తాను పోటీ చేస్తే వారసత్వంపై విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుందని కాంగ్రెస్ నాయకురాలు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. అందుకే, ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగకుండా విస్తృత ప్రచారంలో పాల్గొనాలని నిర్ణయించుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మే 3వ తేదీ నుంచి ఆమె యూపీలో ప్రచారం ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ప్రియాంక ఎన్నికలకు దూరంగా ఉంటే రాయ్‌బరేలీ నుంచి ఎవరు పోటీ చేస్తారనే సందిగ్ధత నెలకొంది. ఇక్కడ కూడా రాహుల్ గాంధీ పేరే వినిపిస్తోంది. అమేథీ లేదా రాయ్‌బరేలీ నుంచి ఆయన పోటీపై 24 గంటల్లో హైకమాండ్ నిర్ణయం తీసుకోనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు అమేథీ నుంచి పోటీ చేసేందుకు ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా ఆసక్తి చూపుతున్న సంగతి తెలిసిందే.

ముందడుగు
బుధవారం, 01-5-2024, హైదరాబాద్

# ఉత్తరాఖండ్ అధికారులు ఇప్పుడు లేచారా

- తొమ్మిది నెలల నుంచి ఏం చేశారు
- సానుభూతి కావాలంటే నిజాయతీగా ఉండండి
- పతంజలి విషయంలో సుప్రీంకోర్టు ఆగ్రహం

**ముందడుగు ఢిల్లీ:**

పతంజలి సంస్థ ప్రజలను తప్పుదోవ పట్టించేలా వాణిజ్య ప్రకటనలు ఇచ్చారని నిర్ధరణ అయిన నేపథ్యంలో పతంజలిపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సంస్థకు చెందిన 14 ఉత్పత్తులు, అనుబంధ విభాగం దివ్య ఫార్మసీ ఉత్పత్తుల తయారీ లైసెన్సును రద్దు చేసింది. ఈవిషయాన్ని రాష్ట్ర లైసెన్సింగ్ అథారిటీ నేడు కోర్టుకు తెలియజేసింది.





దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ''ఏప్రిల్ 10న మేము ఇచ్చిన ఆదేశాల తర్వాతే ఉత్తరాఖండ్ అధికారులు నిద్ర నుంచి మేలుకొన్నట్లు కన్పిస్తోంది. మీరు చేయాలనుకుంటే ఎంత వేగంగానైనా చేస్తారు. కాదనుకుంటే పక్కన పెట్టేస్తారు. తొమ్మిది నెలల నుంచి సంస్థపై మీరెందుకు చర్యలు తీసుకోలేదు? మీకు సానుభూతి కావాలంటే కోర్టుకు నిజాయతీగా ఉండండి'' అంటూ మందలించింది. అయితే, ఈ చర్యలను చట్టప్రకారం తీసుకున్నారా? లేదా అన్నది పరిశీలించాల్సి ఉందని ధర్మాసనం పేర్కొంది. నేటి విచారణకు కూడా పతంజలి వ్యవస్థాపకుడు రామ్‌దేవ్‌బాబా, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు.

# భారతీయుడికి లండన్ కోర్టు జీవిత ఖైదు

## భార్య హత్య కేసులో సంచలన తీర్పు

**ముందడుగు క్రైం:**




లండన్ కోర్టు జీవిత ఓ భారతీయుడికి జీవిత ఖైదు విధించింది. గతేడాది జరిగిన ఈ ఘటనలో తాజాగా న్యాయస్థానం తీర్పు వెలువరించింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. భారత్‌కు చెందిన సాహిల్ శర్మ(24) మెహక్ (19)కు గతేడాది వివాహం జరిగింది. వివాహం అనంతరం దంపతులు లండన్‌లోని క్రోయిడాన్‌లో నివాసముంటున్నారు. ఈ క్రమంలోనే సాహిల్ తన భార్యను కత్తితో దారుణంగా హత్య చేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. హత్య చేసిన సాహిల్ పోలీసులకు సమాచారం అందించాడు. రక్తపు మడుగులో పడి ఉన్న మెహక్‌ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఈ కేసులో న్యాయస్థానం ఎదుట తన భార్యను తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. అయితే, ఈ నేరానికి పాల్పడదానికి గల కారణాలను వెల్లడించలేదు. ఈ కేసులో లండన్ కోర్టు విచారణ చేపట్టి తాజాగా తీర్పు వెలువరించింది. దోషిగా తేలిన సాహిల్‌కు జీవిత ఖైదును విధించింది. ఒకవేళ అతడు పెరోల్ పొందాలనుకుంటే అందుకు కనీసం 15 ఏళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఆదేశించింది.

# గంట వ్యవధిలోనే ఏడు ఇంజక్షన్లు ఇచ్చిన ఆర్ఎంపీ

## రెండు రోజులు చికిత్స చేసినా ప్రాణం నిలవలే

**ముందడుగు వరంగల్:**



ఒక యువకుడికి జ్వరం వచ్చింది.. చికిత్స కోసం తమ గ్రామంలో ఉన్న ఆర్ఎంపీ దగ్గరికి వెళ్లాడు. ఆ ఆర్ఎంపీ గంట వ్యవధిలోనే ఏడు ఇంజక్షన్లు ఇవ్వడంతో ఆ యువకుడి పరిస్థితి విషమంగా మారింది. రెండు రోజుల పాటు ప్రైవేట్ హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ చేసినా ప్రాణాలు దక్కలేదు. ఈ ఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలో సోమవారం వెలుగుచూసింది. వర్ధన్నపేట పట్టణానికి చెందిన కత్తి నవీన్ (28) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 26న జ్వరంతో పాటు, నీరసంగా ఉండడంతో పట్టణంలోని ఫిరంగిగడ్డకు చెందిన ఆర్ఎంపీ ఆడెపు శ్రీనివాస్ వద్దకు వెళ్లాడు. అతడు నవీన్‌ను పరీక్షించి కుడి, ఎడమ తొంటికి రెండు ఇంజక్షన్లు ఇవ్వడంతోపాటు సెలైన్ బాటిల్ పెట్టి అందులో మరో నాలుగు ఇంజక్షన్లు కలిపాడు. దీంతో నవీన్ అపస్మారక స్థితిలోకి వెళ్లడంతోఆర్ఎంపీ వెంటనే మరో ఇంజక్షన్ ఇచ్చాడు. ఇలా గంట వ్యవధిలోనే ఏడు ఇంజక్షన్లు ఇవ్వడంతో నవీన్ పరిస్థితి విషమించింది. కుటుంబ సభ్యులు ఆర్ఎంపీని నిలదీయడంతో ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని సూచించారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్లగా నవీన్ కండిషన్ సీరియస్‌గా ఉందని చెప్పడంతో వరంగల్‌లోని ఓ హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ ఒక రోజు ట్రీట్‌మెంట్ చేసినప్పటికీ నవీన్ పరిస్థితి మెరుగుపడకపోగా, మరింత విషమించింది. దీంతో ఈ నెల 28న హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు చెప్పారు. నవీన్ చనిపోవడంతో ఆర్ఎంపీ శ్రీనివాస్ వర్ధన్నపేట నుంచి పరార్ అయ్యారు. ఆర్ఎంపీ నిర్లక్ష్యం, ఇష్టారాజ్యంగా ఇంజక్షన్లు ఇవ్వడం వల్లే తన భర్త ప్రాణాలు కోల్పోయాడంటూ నవీన్ భార్య మేఘన సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.



# కరోనా సీక్వెన్స్ ప్రచురించిన శాస్త్రవేత్తకు అష్టకష్టాలు

- దేశాధికారుల నుంచి మొదలైన వేధింపులు
- ల్యాబ్ నుంచి వెళ్లిపోవాలని చైనా ఆదేశాలు

**ముందడుగు జాతీయం:**

ప్రపంచాన్ని వణికించిన కరోనా వైరస్ సీక్వెన్స్‌ను తొలిసారి ప్రచురించిన శాస్త్రవేత్తకు ఇప్పుడు వేధింపులు మొదలయ్యాయి. కొంతకాలంగా చైనా దేశాధికారుల నుంచి వేధింపులను ఎదుర్కొంటున్నాడు. తాజాగా ఆయన పనిచేస్తున్న ల్యాబ్ నుంచి వెళ్లిపోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దాంతో చేసేది లేక అదే ల్యాబ్ ఎదుట ఆయన నిరసనకు దిగాడు. తనతోపాటు తన బృందాన్ని కూడా ప్రయోగశాల నుంచి బయటకు వెళ్లాలని అధికారులు ఆదేశించారని పేర్కొంటూ వైరాలజిస్టు జాంగ్ యోంగ్‌జెన్ ఓ సామాజిక మాధ్యమంలో పోస్టు చేశాడు. వర్షం కురుస్తున్నప్పటికీ ఆదివారం నుంచి ల్యాబ్ వెలుపలే కూర్చొని నిరసన చేపట్టినట్లు అందులో పేర్కొన్నాడు. అనంతరం ఆ పోస్టును ఆయన తొలగించినప్పటికీ.. కార్యాలయం బయటే ఆందోళన కొనసాగిస్తున్నట్లు తెలిసింది. దీనిపై స్పందించాలని మీడియా కోరగా.. మాట్లాడేందుకు అనువైన పరిస్థితులు లేవని బదులిచ్చాడు. జనవరి 2020లో కొవిడ్19 కారణమైన వైరస్ సీక్వెన్స్‌ను ప్రచురించిన మొదటి చైనా శాస్త్రవేత్తగా జాంగ్ నిలిచారు. నాటి నుంచి ఆయనపై వేధింపులు మొదలైనట్లు సమాచారం.

# ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మళ్లీ తుపాకుల మోత


## తొమ్మిది మంది మావోయిస్టులు మృతి



**ముందడుగు ఛత్తీస్‌గఢ్:**

ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మళ్లీ తుపాకుల మోత మోగింది. నారాయణపూర్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో తొమ్మిది మంది మావోయిస్టులు హతమైనట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో మహిళా దళ సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. సంఘటనా స్థలం నుంచి ఒక ఏకే 47తో సహా భారీ మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టులు, జిల్లా రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ సంయుక్త భద్రతా బృందానికి మధ్య మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగినట్లుగా అధికారులు తెలిపారు. నారాయణపూర్, కాంకేర్ సరిహద్దు ప్రాంతంలోని అబుజ్‌మర్‌లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారం మేరకు భద్రతా బలగాలు సోమవారం ఆపరేషన్ కోసం బయలుదేరాయి. టెక్‌మెటా, కాకూర్ గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో బలగాలు, మావోయిస్టులకు మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. మహిళా మావోయిస్టులతో సహా మొత్తం తొమ్మిది మంది మావోల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని.. వాటి గుర్తింపు పనులు కొనసాగుతున్నాయని ఓ అధికారి తెలిపారు. మావోయిస్టుల శిబిరం నుంచి భారీ మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ఓ ఏకే 47తో సహా నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు భారీగా ఎదురుదెబ్బ తగులుతున్నాయి.

ముందడుగు
బుధవారం,
01-5-2024,
హైదరాబాద్



# తండ్రి బాగోగులను పట్టించుకోని కొడుకులు

## యావదాస్తిని కొండగట్టు అంజన్నకు రాస్తున్న వైనం

**ముందడుగు కరీంనగర్:**

కన్నకొడుకులను తల్లిదండ్రులు ఎంతో అల్లారుముద్దుగా పెంచుతారు. కాని కొడుకులు మాత్రం పెరిగి పెద్దయ్యాక తల్లిదండ్రులను మరిచిపోతారు. అలాంటిది కష్ట, నష్టాలకు ఓర్చి కొడుకులను పెంచి పెద్ద చేస్తే పట్టించుకోవడం లేదని ఓ తండ్రి ఆవేదన చెందాడు. తన యావదాస్తిని దేవుడి పేర రాసేందుకు సిద్ధమయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దపేట జిల్లా చిన్న కోడూరు మండలం అలీపూర్‌కు చెందిన బాలయ్య తన కొడుకులు అన్నం పెట్టట్లేదని, సరిగా చూసుకోవట్లేదని మనస్థాపానికి గురయ్యాడు. తన యావదాస్తిని కొండగట్టు అంజన్నకు సమర్పించేందుకు సిద్ధమయ్యాడు. తాను తీసుకున్న నిర్ణయం ప్రకారం కొండగట్టుకు చేరుకుని అనంతరం తనతో పాటు తీసుకువచ్చిన తన ఆస్తికి సంబంధించిన పత్రాలను కొండగట్టు దేవస్థానంలోని హుండీలో వేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఆస్తి పత్రాలు హుండీలో వేస్తే చెల్లదని పూజారులు చెప్పడంతో చివరి నిమిషంలో తన ఆలోచన మార్చుకున్నాడు. ఆస్తిని కొండగట్టు అంజన్న పేరుతో పట్టా చేస్తానని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను కోరారు. అందుకు అధికారులు సరేననడంతో బాలయ్య వెనుదిరిగాడు.






# మీ మేనిఫెస్టోలు బాండ్ పేపర్ మీద రాసివ్వండి

- రాజకీయపార్టీలకు జెడీ లక్ష్మినారాయణ సవాల్
- వంద రూపాయల స్టాంపు పేపర్ పై నేను రాసి ఇస్తాను
- ఉత్తర విశాఖ అభ్యర్థి జెడీ లక్ష్మినారాయణ

**ముందడుగు విశాఖపట్నం:**

ప్రజలను ప్రలోభ పెట్టేందుకు అన్ని రాజకీయపార్టీలు వారి మేనిఫెస్టోలు ప్రకటించాయని, వారి మేనిఫెస్టోలు బాండ్ పేపర్ మీద రాసి ఇవ్వాలని జై భారత్ పార్టీ ఉత్తర విశాఖ ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ సిబిఐ జెడీ లక్ష్మినారాయణ అన్నారు. మంగళవారం మద్దిలపాలెం పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఏదైనా సంకల్పం చేసినప్పుడు సంకల్పం వెనకాల దైవ బలం కావాలి. మనం ఎంత ప్రయత్నించిన చివరి మెట్టుకు దైవం బలం ఉండాలి. ఆ దైవం బలం నాకు మీ నుండే రావాలి. ఎందుకంటే నేను ఇప్పుడు రాజకీయంలో పెద్ద శక్తులతో పోరాడుతున్నాను. డబ్బులు ఎవరి దగ్గర ఉంటే వారు నాయకులు అనే ఆలోచన ఉంది. దానిని మార్చాలి. సామాన్యుడు కూడా రాజకీయాల్లో వచ్చి మార్పు తీసుకురాగలరని చిన్న ప్రయత్నం చేస్తున్నాను.

### నాయకులు పెట్టే కోట్ల డబ్బులు ఎక్కడివి

ఎన్నికలలో ఒక్కో ఎమ్మెల్యేకు 40 కోట్లు, ఎంపీ అభ్యర్థికి 100 నుంచి 150 కోట్లు ఖర్చు పెట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మళ్లీ వాటిని సంపాదించాలంటే ప్రజలనే పన్నుల రూపంలో, ధరల రూపంలో పీడించాలి. రాజకీయాలు మనకు సంబంధం లేదు అని చాలా మంది అనుకుంటారు. ప్రతి ఒక్కరి జీవితాలను రాజకీయాలను ప్రభావితం చేస్తాయి. రాజకీయాలను మార్చుతే పిల్లలు బాగుంటారు. వాతావరణం బాగుంటుంది.

### సులభంగా డబ్బు డ్రగ్స్ లో దొరుకుతుంది

విశాఖపట్నంలో విచ్చలవిడిలో డ్రగ్స్ పట్టుబడింది. అందులో చాలామంది రాజకీయనాయకుల హస్తం ఉందని మీడియా ద్వారా తెలిసింది. అంతకుముందు వచ్చిన డ్రగ్స్ ఎక్కడికి పోయిందో ఎవరికి తెలియదు. మాకు డబ్బు కావాలి సమాజం, యువత ఏటు పోయినా ఫర్వాలేదు అని నాయకులు అనుకుంటున్నారు. అందుకు మనం చెడు రాజకీయాలను ప్రక్షాళన చేయాలి. దుష్టశక్తులపై విజయం సాధించే శక్తిని మీరంతా ఇవ్వాలి. ధార్మిక సంఘాల అభివృద్ధికి కృషి చేస్తాను. కమ్యూనిటి హాల్స్ నిర్మాణం చేపడుతాను. విదేశీ విద్యకు సపోర్టు చేస్తాను. పాస్టర్స్ కూడా కాలనీల నిర్మాణం చేపట్టే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది పాస్టర్లు పాల్గొన్నారు.

# కేసీఆర్ హయాంలో రెప్పపాటు కరెంట్ పోలే

- మా పాలనలో వచ్చిన కరెంటు ఇప్పుడేదీ..?
- కాంగ్రెస్ పాలనలో మొదలైన కరెంట్ కష్టాలు
- కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డ కేసీఆర్

**ముందడుగు ఖమ్మం:**

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలకు కరెంటు కష్టాలు మొదలైనయని అన్నారు. మా పాలనలో వచ్చిన కరెంటు ఇప్పుడు ఎక్కడికి మాయమైపోయిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. 'మేం అధికారంలోకి రాంగనే ఆరు గ్యారంటీలకు చట్టం చేసి, చట్టబద్ధత కల్పించి అందరికీ న్యాయం చేస్తమని ఆనాడు కాంగ్రెస్ నేతలు చెప్పిండ్రు. కానీ ఏది కూడా చెయ్యలే. మరె ఏంజేస్తున్నరు వీళ్లు. ఆనాడు 24 గంటల కరెంటు వచ్చింది రైతాంగానికి. ఇప్పుడు కరెంటు వస్తుందా..? లేదంటే కరెంటు కోతలు అయితున్నాయా..?' అని కేసీఆర్ ప్రశ్నించారు. జనం కరెంటు వస్తలేదనడంతో 'మరె ఏమయ్యింది కరెంటుకు..? కేసీఆర్ ఉన్నప్పుడు ఒక రెప్పపాటు కూడా పోని కరెంటు ఇప్పుడు ఎక్కడికి మాయమైంది..?' అన్నారు. 'ఇదే జిల్లాలో ఒక గిరిజన గూడెం ఉంటది. పినపాక నియోజకవర్గంలో ఉంది ఆ గూడెం. బ్రహ్మాండంగా మిషన్ భగీరథ కార్యక్రమం పెట్టి 'దొంగతోపు' అనే ఆ చిన్న గిరిజన గూడేనికి కూడా నీళ్లు పంపినం. ఇయ్యాల అక్కడ మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నయా..? వస్తలేవు. అక్కడ కూడా ఇబ్బందే జరుగుతున్నది. అదేవిధంగా గిరిజన బిడ్డలకు త్రీ ఫేజ్ కరెంటు ఇవ్వాలని, అక్కడ కూడా బ్రహ్మాండంగా వ్యవసాయం జరగాలని, పంటలు సక్రమంగా



పండాలని కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి త్రీ ఫేజ్ కరెంటు ఇప్పించినం. ఇయ్యాల అక్కడ మోటార్లు కాలుతున్నయ్. పొలాలు ఎండిపోతున్నయ్, రైతులు బాధపడుతున్నరు' అని కేసీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు.